సాక్షి ప్రకాశం

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

జిల్లాలో ఎరువుల దుకాణాలు, గోడౌన్లలో పోలీసులు, వ్యవసాయాధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు.

- 8లో..



పచ్చనేతల పత్తేపారం

పొన్నలూరు మండలం కే అగ్రహారంలో ఇళ్లకు మట్టితోలుకెళ్లే వారిని టీడీపీ నాయకులు బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
31 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పోటాపోటీగా లడ్డుల వేలం పాటలు

● రూ.1.56 లక్షలు పలికిన గణేష్ లడ్డు



రూ.1.56 లక్షలకు లడ్డును పాడుకున్న అనుముల చలపతి

చీమకుర్తి: వినాయక నిమజ్జనం సందర్భంగా పలు వినాయకుడి విగ్రహాల వద్ద లడ్డు వేలం పాటలు పోటాపోటీగా జరుగుతున్నాయి. పద్మశాలీయుల ఆధ్వర్యంలో చీమకుర్తిలోని శ్రీభావనారుషి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద లడ్డును అనుముల చలపతి రూ.1.56 లక్షలకు పాడుకున్నారు. స్వామి వారి వద్ద పూజలు అందుకున్న 25 కేజీల లడ్డును పాడుకున్న అనంతరం బంధువులతో కలిసి ఊరేగింపుగా ఇంటికి ఉత్సాహంగా తీసుకెళ్లారు. చీమకుర్తిలోనే రెడ్డిబజార్‌లో ఏర్పాటు చేసిన వినాయుడి ఊరేగింపులో ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి పాల్గొన్నాడు. రెడ్డిబజారులో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డును బీమనాథం శేషిరెడ్డి, సుబ్బారెడ్డి కలిసి రూ.1.12 లక్షలకు పాడుకున్నారు.

నక్కల గిరిజనులకు పక్కా గృహాలు నిర్మించాలి



నిరసన తెలుపుతున్న నక్కల గిరిజనులు

ఒంగోలు వన్‌టౌన్: నక్కల గిరిజనులకు పక్కా గృహాలను నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఒంగోలు కలెక్టరేట్ వద్ద నక్కల గిరిజనుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి నక్కల గిరిజన సంఘం అధ్యక్షుడు ఆర్ రాణెమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అయినా నక్కల వారికి కనీస మౌలిక వసతులను పాలకులు కల్పించలేదన్నారు. దీంతో వారు రోడ్లమీదనే జీవనం కొనసాగిస్తున్నారన్నారు. గతంలో నగరంలోని నక్కల వారికి అల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ముంపు ప్రాంతంలో 55 కుటుంబాలకు నివేశన స్థలాలు ఇచ్చారన్నారు. వారు ఏర్పాటు చేసుకున్న నిర్మాణాలు ముంపునకు కొట్టుకుపోయారన్నారు. దీంతో వారు తిరిగి రోడ్లమీదనే నివసిస్తున్నారన్నారు. కార్యక్రమానికి ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి టి.వెంకటస్వామి, రచయిత పిన్నిక శ్రీనివాస్, గిరిజన నాయకులు జెమిని, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు. సీఐ, తహసీల్దార్ ఇచ్చిన హామీతో ధర్నా విరమించారు.

పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో అపశ్రుతి

● స్పృహ కోల్పోయిన గర్భిణి



కళ్లు తిరిగి పడిపోయిన గర్భిణి బత్తుల లక్ష్మీ తిరుపతమ్మ

పీసీపల్లి: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో గర్భిణి స్పృహ కోల్పోయిన ఘటన పీసీపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పీసీపల్లి మండలం మల్లేనివారిపల్లికి చెందిన బత్తుల లక్ష్మీ తిరుపతమ్మ 8వ నెల గర్భిణి కావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చూపించుకునేందుకు వచ్చింది. ఆ సమయంలో పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా జనసేన అభిమానులు వైద్యశాలలో రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసే కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు స్థానిక టీడీపీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వచ్చారు. ఆయనకు స్వాగతం పలికేందుకు, ఎమ్మెల్యే మెప్పు పొందేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది అంతా రోగుల గురించి పట్టించుకోకుండా ఎమ్మెల్యే చుట్టూ చేరారు. రోగులు కూర్చునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఆ సమయంలో గర్భిణి లక్ష్మీ తిరుపతమ్మ కళ్లు తిరిగి స్పృహ తప్పి కింద పడిపోయింది. అప్పటికి గానీ వైద్య సిబ్బందిలో చలనం రాలేదు. గర్భిణిని తీసుకెళ్లి సెలైన్ పెట్టి చికిత్స అందించారు. దీనిపై స్థానిక డాక్టర్ యశ్వితను వివరణ కోరగా తిరుపతమ్మ ఆరో నెల గర్భిణి అని, అంతమందిని చూసి భయపడి కళ్లు తిరిగి పడిపోయిందని చెప్పారు. తిరుపతమ్మ భర్త బత్తుల బాబు మాట్లాడుతూ తన భార్య 8వ నెల గర్భిణి అని, అది కూడా వైద్యులకు తెలియ లేదని, ప్రభుత్వాస్పత్రిలో అసలు రోగుల గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. వచ్చిన రోగులు కూర్చునేందుకు కూడా అవకాశం లేకపోవడంతో బీపీ డౌన్ అయి కిందపడిపోయిందని చెప్పాడు.

మది మదిలో మూర్తిమత్వమై..

- పట్నం నుంచి పల్లె వరకూ అంతటా మహానేతకు నివాళులు
- జిల్లాకు రాజన్న చేసిన సేవలు స్మరించుకున్న అభిమానులు, ప్రజలు
- జిల్లా వ్యాప్తంగా అన్నదానాలు, సేవా కార్యక్రమాలు



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్‌ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, మేరుగు నాగార్జున, బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు తదితరులు



వెస్లీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులు



కొనకనమిట్లలో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



దర్శిలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ



జరుగుమల్లిలో అన్నదానం చేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ఒంగోలు టౌన్:

గుండె గుండెలో చెరిగిపోని జ్ఞాపకాలైం.. అభిమానం పూలమాలలై.. పట్టణాల నుంచి పల్లెల దాకా ప్రతి ఊరు రాజన్న జ్ఞాపకాలతో పరవశించింది. మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా కృతజ్ఞతలు, కన్నీళ్లతో తడిసిన పూలదండలై రాజన్న విగ్రహాలను హత్తుకున్నాయి. ప్రజా సంక్షేమానికి, ప్రగతి ప్రస్థానానికి వేసిన పునాదులు ఆ దివ్య తేజోమూర్తి పాలన నేటికీ జనం గుండెల్లో ప్రతిధ్వనిస్తోంది. ఆయన పాలనా దక్షత స్ఫూర్తి తరతరాలకు అజరామరంగా చిరస్మరణీయంగా నిలిచిపోయింది. జిల్లా కేంద్రమైన ఒంగోలు నుంచి మారుమూల పుల్లల చెరువు మండలం వరకు ప్రతి పట్టణంలోను, గ్రామంలోనూ రాజన్నకు ఘనంగా నివాళులర్పించారు. బరువెక్కిన గుండెలతో.. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సామాన్య ప్రజలు రాజన్న చేసిన సంక్షేమ పాలనను మననం చేసుకొన్నారు. తమ భవిష్యత్ కోసం పునాదులేసిన ప్రజానేత ప్రవేశ పెట్టిన పథకాలను నేటికీ అమలవుతున్న తీరును స్మరించుకున్నారు.

పార్టీ జిల్లా కార్యాలయంలో..

నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణా రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, బొట్ల రామారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజేష్, రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి రవీంద్రా రెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, నగర అధ్యక్షుడు కఠారి శంకర్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రవణమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని పలు డివిజన్లలో పేదలు, మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. అన్నదానాలు చేపట్టారు. చర్చి సెంటర్‌లో ఉన్న వెస్లీ విగ్రహానికి పార్టీ నాయకులు నివాళులర్పించారు.

దర్శి నియోజకవర్గంలో...

దర్శి నియోజకవర్గంలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలసి పాల్గొన్నారు. రాజన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని వైఎస్సార్ సెంటర్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తరెడ్డి పాలెం, తూర్పు వీరాయపాలెం గ్రామాల్లో మహానేత రాజన్న విగ్రహాలకు పూలమాలలు వేశారు. నియోజకవర్గంలోని అన్నీ మండలాల్లోనూ వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు.

కొండపి నియోజకవర్గంలో...

కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మహానేత రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి , మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ సింగరాయకొండలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మూలగుంటపాడు పంచాయతీలోని ఐటీఐ కాలేజీలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడ నుంచి కందుకూరు సెంటర్, బాలయోగి నగర్ సెంటర్లలోని వైఎస్సార్ విగ్రహాలకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అభిమానులు ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు. జరుగుమల్లి, పొన్నలూరులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యాక్రమాలను ఆయన ప్రారంభించారు. అలాగే కొండపి, మర్రిపూడి, టంగుటూరు మండలాల్లో కూడా పార్టీ శ్రేణులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

మార్కాపురం నియోజకవర్గంలో..

మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో మార్కాపురం నియోజకవర్గంలో పొదిలి, తర్లుపాడు, కొనకనమిట్ల మండల కేంద్రాలతో పాటుగా అన్నీ గ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మార్కాపురం పట్టణంలోని పాత బస్టాండు సెంటర్లోని వైఎస్సార్ విగ్రహానికి, తూర్పు వీధుల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ అలీ బేగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డితో పాటు పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. తర్లుపాడులో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కొనకనమిట్లలో జరిగిన రక్తదాన శిబిరాన్ని అన్నా రాంబాబు ప్రారంభించారు. అనంతరం అన్నదానం చేశారు.

గిద్దలూరు నియోజకవర్గంలో...

గిద్దలూరు నియోజకవర్గంలో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట, కంభం, అర్ధవీడు మండలాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కుందురు నాగార్జున రెడ్డి అర్ధవీడు మండలంలోని నాగులవరం గ్రామంలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీగా ఏర్పాటు చేసిన అన్నదానం చేశారు. రాచర్ల మండలంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

కనిగిరి నియోజకవర్గంలో...

కనిగిరి నియోజకవర్గంలోని అన్నీ మండలాల్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కనిగిరి పట్టణంలోని చెక్‌పోస్టు సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పీడీసీసీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సరిత ప్రసాద్ రెడ్డి, చింతంగుంట్ల సాల్మన్ రాజ్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పల్లి శాంతి గోవర్ధన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.సుజాత రెడ్డి పాల్గొన్నారు.

యర్రగొండపాలెంలో..

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పుల్లలచెరువులో వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. పెద్దదోర్నాల ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పెద్దారవీడులో పేదలకు అల్పాహారం సమకూర్చారు. యర్రగొండపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి సెంటర్‌లో ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు.

సంతనూతలపాడు నియోజకవర్గంలో..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సంతనూతలపాడు నియోజకవర్గంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చీమకుర్తిలోని బూచేపల్లి కళ్యాణ మండపం, పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. మద్దిపాడు మండలం వెల్లంపల్లిలో మాజీ మంత్రి మేరుగు నాగార్జున వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అన్నదానం చేశారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. సంతనూతలపాడు, చీమకుర్తి మండలం ఇలపావులూరు, నాగులుప్పలపాడుల్లో నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లోనూ మేరుగు నాగార్జున పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు.

ఇడుపులపాయలో వైఎస్సార్‌కు తాటిపర్తి నివాళి

యర్రగొండపాలెం: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్‌లో ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పర్తి ఓబులరెడ్డి, ఆర్య వైశ్య సంఘం నాయకులు పబ్బిశెట్టి శ్రీనివాసులు, దోగిపర్తి సంతోష్‌కుమార్, యువజన విభాగం నాయకుడు ఆళ్ల కృష్ణారెడ్డి ఉన్నారు.



మద్దిపాడు మండలం వెల్లంపల్లిలో రక్తదానాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున



అర్ధవీడు మండలం నాగులవరంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



ఒంగోలు 33వ డివిజన్ మంగమూరు రోడ్డులో అన్నదానం చేస్తున్న చుండూరి రవిబాబు, బత్తుల, కటారి శంకర్ తదితరులు



కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్

బడుగు వర్గాల ఆరాధ్య దైవం వైఎస్సార్

● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి

ఒంగోలు టౌన్: విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి సంక్షేమ పథకాలను బడుగు, బలహీన వర్గాల ముంగిళ్లకు తెచ్చిన ఆరాధ్య దైవం వైఎస్ రాజశేఖర రెడ్డిని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎప్పటికీ మరచిపోరని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ నాయకులతో కలిసి వైఎస్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైఎస్‌ఆర్ పాదయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకొని అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజారంజక పరిపాలన అందించారని కొనియాడారు. దేశంలో రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత వైఎస్సార్ ఒక్కరికే దక్కుతుందన్నారు. ఏ ఒక్క పేద విద్యార్థి చదువు ఆగిపోకూడదన్న లక్ష్యంతో ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. దాంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని లక్షలాది మంది నిరుపేద బిడ్డలు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సంపాదించుకున్నారని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో ఇంటింటికో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉన్నాడంటే అది రాజశేఖర రెడ్డి పుణ్యమేనన్నారు. కార్పొరేట్ విద్యను పేదల ముంగిళ్లకు తెచ్చిన రాజశేఖర రెడ్డిని విద్యాదాతగా ఎంతో మంది గుండెల్లో పెట్టుకొని పూజిస్తున్నారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన వెంకాయమ్మ, మేరుగు

కులమతాలకతీతంగా సమాజంలోని అన్నీ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి దైవంగా నిలిచాడన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడానికి జగనన్న నాయకత్వంలో కలిసి మెలసి పని చేస్తున్నామని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనతో రాజన్న పాలన తెస్తామన్నారు.

చంద్రబాబు పాలనలో అధోగతిలో రాష్ట్రం...

చంద్రబాబు ఏడాదిన్నర పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని మాజీ మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. వ్యవసాయం దండగన్న పాలకుల రాజ్యంలో దుర్భర పరిస్థితి నెలకొందని, రైతులు గిట్టుబాటు ధరలు రాక అల్లాడి పోతున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. పొగాకు, పత్తి రైతుల గోడు వినేనాథుడే లేకుండా పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్న మరణించిన 16 ఏళ్లయినా నేటికీ ప్రజలు ఆయనను మరిచిపోలేదని, గుండెల్లో పెట్టుకొని పూజిస్తున్నారని చెప్పారు. అందుకు ఆయన చేసిన సేవలే కారణమన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి ప్రాజెక్టులు నిర్మించారని, ఆయన ప్రారంభించిన ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో రైతులకు కరువు దిగులు ఉండదన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తున్న జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడం ద్వారానే రాజన్న రాజ్యం వస్తుందన్నారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి పేదల గుండెల్లో ఎప్పటికీ నిలబడి పోతారని చెప్పారు. ఒంగోలు పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర రెడ్డి పాలన ఒక స్వర్ణయుగంగా నడిచిందని, ప్రజలు సంతోషంతో జీవించారన్నారు. అలాంటి పాలన కోసం జగనన్నను సీఎం చేసుకుందామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యాన్ని అందించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. రాజన్న సంక్షేమ రాజ్యం అనేది ప్రజల్లో ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణా రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, బొట్లా రామారావు, ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జనరల్ సెక్రటరీ రొండా అంజిరెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్‌వి అవకాశవాద రాజకీయాలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

● వైపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అవకాశవాద రాజకీయాలకు తెరతీసినట్లు సుగాలీ ప్రీతి కేసులో తేటతెల్లమైందని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారాన్ని చేజిక్కించుకోవటానికి పవన్ కళ్యాణ్ సుగాలీ ప్రీతి కేసును వారధిగా వాడుకున్నాడని అన్నారు. గిరిజన బిడ్డకు జరిగిన అన్యాయాన్ని డబ్బుతో వెలకట్టినట్లు మాట్లాడిన తీరు ఆయన అగ్రకుల అహంకారాన్ని బయటపెట్టిందన్నారు. తన కుటుంబాన్ని దూషించారని కేసులు కట్టి జైళ్లలో పెట్టించిన ఈ పెద్దమనిషి అతి క్రూరంగా అభం శుభం తెలియని బిడ్డను అత్యాచారం, హత్య చేసిన సంఘటనపై అప్పటి తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఒక్క మాట మాట్లాడలేదన్నారు. 2024 ఎన్నికల్లో లబ్ధి పొందటానికి ఈ వ్యవహారాన్ని ఎంచుకున్నాడని అన్నారు. సుగాలి ప్రీతి కుటుంబానికి అండగా నిలిచి పొలం, స్థలం, ఉద్యోగాన్ని బాధ్యతగా ఇచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని, అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని నిందించడమే లక్ష్యంగా చేసుకున్నాడని అన్నారు. ఈ కేసులో ఎటువంటి రాజకీయ ఒత్తిడిలకు లోను కాకుండా విచారణ జరిపించాలన్న ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి సీబీఐకి అప్పగించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కేసుతో రాజకీయ లబ్ధిపొందిన పెద్దమనిషి పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగురాలైన ప్రీతి తల్లి గర్భ శోకాన్ని అవహేళన చేయడం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన సహాయాన్ని కూడా తన ఖాతాలో వేసుకొని మాట్లాడటం హేయమైన చర్య అని అన్నారు. సీబీఐకి వనరులు ఇవ్వకుండా ఆ కేసులో అరెస్ట్ అయిన వారితో డీఎన్ఏ మ్యాచ్ కాలేదని లాజిక్‌లేని అసంబద్ధమైన వ్యాఖ్యలతో తప్పించుకునే ప్రయత్నం చేయడం డీసీఎంతోపాటు సీఎం చంద్రబాబు అసమర్థతకు అద్దం పడుతోందని అన్నారు. డీఎన్ఏ ఇప్పుడు ఉన్న నిందితులతో మ్యాచ్ కావడంలేదంటే ఈ కేసులో ఇంకెవరో నిందితుడు తప్పించుకున్నాడన్న నిజం తెలిసినా కూడా పవన్ కళ్యాణ్ ప్రజల దృష్టిని మళ్లించటానికి జనసేన నేతలతో దివ్యాంగురాలైన ప్రీతి తల్లి అవమానపరిచేలా మాట్లాడించారని అన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.అరుణాబాయి, పుల్లలచెరువు జెడ్పీటీసీ వాగ్యా నాయక్, నాయకులు కె.సురేష్ నాయక్, పి.మంత్రూనాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ లైన్ ఏర్పాటు నిలిపివేత



పొలంలో స్తంభానికి కిందకట్టి వదిలిపెట్టిన విద్యుత్ తీగ

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: మండలంలోని పెంచికలపాడులో రైతుల పొలాల్లో నుంచి అక్రమంగా ఇండస్ట్రీయల్ అవసరాల కోసం లాగుతున్న విద్యుత్ లైన్‌ను నిలిపేశారు. ఈనెల 1వ తేదీన 'విద్యుత్ లైన్ ఏర్పాటు అడ్డగింత' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొమరోలు మండలం ముత్తరాసుపల్లెలో మొక్కజొన్న ఇండస్ట్రీ కోసం పెంచికలపాడు నుంచి రైతుల పొలాల్లోంచి హైవేరోడ్డు పక్క నుంచి విద్యుత్ స్తంభాలు వేస్తున్నారు. ఈ విషయంపై రైతులు ఎటువంటి అనుమతులు లేకుండా మా పొలాల్లో విద్యుత్ లైన్ ఏలా ఏర్పాటు చేస్తారని అడ్డుకున్నారు. కలెక్టర్, తహసీల్దార్, విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యుత్ లైన్ ఏర్పాటు పనులను నిలిపివేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



తీవ్రగాయాలతో మృతిచెందిన కొండయ్య

కొమరోలు: బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కొమరోలు మండలంలోని దద్దవాడ గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గిద్దలూరు మండలం పొదలకొండపల్లె గ్రామానికి చెందిన కప్పల కొండయ్య(23) పని నిమిత్తం బేస్తవారపేట మండలం మోక్షగుండం గ్రామానికి వెళ్లాడు. తన బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తున్న సమయంలో దద్దవాడ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కొండయ్య తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై నాగరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

5న టెన్నికాయిట్ జట్ల ఎంపిక

సింగరాయకొండ: స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఈనెల 5వ తేదీన ఉమ్మడి ప్రకాశం జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్త్రీ, పురుషుల అండర్-18 జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి ఎన్‌టీ ప్రసాద్ తెలిపారు. ఎంపికైన జట్లు ఈనెల 13, 14వ తేదీల్లో కోనసీమ జిల్లాలోని మండపేటలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ సమర్పించాలని, వివరాలకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ పీడీ శంకరరావును సంప్రదించాలని సూచించారు.

పచ్చ నేతల పత్తేపారం!

- పొన్నలూరు మండలం కె.అగ్రహారంలో టీడీపీ నేతల వసూళ్ల దందా
- ఇళ్లకు మట్టి తోలుకునే వారిని బెదిరించి మరీ డబ్బు వసూలు
- మట్టి తోలితే ట్రక్కుకు రూ.200 ఇవ్వాలని డిమాండ్
- ఇవ్వకుంటే పోలీసు కేసులు పెట్టిస్తామని బెదిరింపులు
- టీడీపీ నేతల అక్రమ వసూళ్లపై గ్రామస్తుల ఆగ్రహం



కె.అగ్రహారం శివారులోని మట్టి దిబ్బలు

పొన్నలూరు:

అధికారం చేతిలో ఉండగానే నాలుగురాళ్లు వెనకేసుకోవడానికి టీడీపీ నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఇంటి నిర్మాణాల కోసం మట్టి తీసుకెళ్తున్న సామాన్య ప్రజలపై బెదిరింపులకు పాల్పడుతూ వసూళ్ల దందాకు తెరలేపారు. ఇదేమని ప్రశ్నించిన వారిని పోలీస్ కేసులు పెట్టిస్తామని బెదిరించి అందినకాడికి దోచుకుంటూ జేబులు నింపుకొంటున్నారు. ఈ తంతు పొన్నలూరు మండలంలోని కె.అగ్రహారంలో గత నెల రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. కె.అగ్రహారం గ్రామ శివారులో కొంత నాణ్యమైన మట్టి దిబ్బలు ఉన్నాయి. అయితే స్థానిక ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు వారి ఇంటి నిర్మాణాలతో పాటు ఇళ్ల ముందు మెరకలు చదును చేయడానికి ట్రాక్టర్లతో మట్టి తీసుకెళ్తుంటారు. ఇందులో ఎవరి ప్రమేయం లేకుండా, డబ్బు చెల్లించకుండా స్థానికులు తమ గృహావసరాల కోసం మట్టి తోలుకుంటుంటారు. అయితే స్థానిక టీడీపీ నాయకుల కన్ను మట్టి తోలుకునే వారిపై పడింది. మట్టి దిబ్బలు తమ సొంతమైనట్టు భావించి ఆంక్షలకు తెరలేపారు. గృహావసరాల కోసం మట్టిని తీసుకెళ్తున్న వారిని బెదిరించి వసూళ్ల పర్వాన్ని ప్రారంభించారు. స్థానికులు తమ అవసరాల నిమిత్తం మట్టి తీసుకెళ్లాలంటే ట్రాక్టర్ ట్రక్కుకు రూ.200 చెల్లించాల్సిందేనని టీడీపీ నేతలు అల్టిమేటం జారీ చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. గత నెల రోజులుగా అక్రమ దందా సాగుతున్నా ఏ అధికారీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.

కేసులు పెట్టిస్తామని బెదిరింపు

మట్టి తీసుకెళ్లే వారు డబ్బు ఇవ్వని పక్షంలో అక్రమ కేసులు బనాయిస్తామని టీడీపీ నాయకులు బెదిరిస్తున్నట్లు సమాచారం. అలాగే సంబంధిత పంచాయతీ అధికారులతో స్థానికంగా మట్టి తోలుకునే వారి దగ్గరకు పంపించి బెదిరిస్తున్నారు. ఇదేమి పద్ధతి అని ఎదురు ప్రశ్నించిన వారిని దుర్భాషలాడటమే కాకుండా దాడికి ప్రయత్నిస్తుండటంతో మిన్నకుండిపోవాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. మట్టి మాటున వేల రూపాయలు పోగేసుకున్న టీడీపీ నాయకులు.. సొంత పార్టీ సానుభూతిపరుల వద్ద కూడా డబ్బు వసూలు చేయడంతో వారు సైతం లోలోన రగిలిపోతున్నారు.

తాలుకా పోలీసుల ఓవరాక్షన్ ఎవరి మెప్పు కోసం?

- కొప్పోలులో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమానికి పోలీసుల ఆటంకం
- పోలీసుల తీరుపై వైఎస్సార్ సీపీ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి ఆగ్రహం



ఒంగోలు టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించకుండా తాలుకా పోలీసులు ఆటంకాలు సృష్టించడం దుర్మార్గమని నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని అనేక ప్రాంతాలతోపాటుగా 45వ డివిజన్ కొప్పోలులో వైఎస్సార్ 16వ వర్ధంతి నిర్వహిస్తుంటే తాలుకా పోలీసులు ఇబ్బందులు పెట్టారని ఆక్షేపించారు. పాటలు పెట్టవద్దని, సభ జరపవద్దని మాటిమాటికీ వేదిక వద్దకు వచ్చి అడ్డుకునేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని చెబుతున్నా వినకుండా ఓవరాక్షన్ చేయడాన్ని తప్పుబట్టారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు వర్ధంతి, జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారని, అప్పుడు తాము ఎలాంటి ఆటంకాలు సృష్టించలేదని గుర్తుచేశారు. కూటమి పాలనలో వర్ధంతిని నిర్వహించుకునే స్వేచ్ఛ కూడా లేకుండా పోయిందని, ఇంతటి క్రూరత్వం గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రుల్లో రాజశేఖరరెడ్డిని ప్రజలు గుండెల్లో పెట్టుకొన్నారని, ప్రజల హృదయాల్లో కొలువైన నాయకుడి వర్ధంతిని ప్రశాంతంగా నిర్వహించుకొంటున్నా పోలీసులను ముందుపెట్టి అడ్డుకోవాలని టీడీపీ నేతలు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి సంస్కృతి మంచిది కాదని, కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదన్న విషయం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. అతిగా ప్రవర్తించిన పోలీసుల మీద తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఎస్పీ ఏఆర్ దామోదర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో న్యాయం దక్కలేదని..

- గిద్దలూరు కోర్టు ఆవరణలో పురుగుమందు తాగిన దంపతులు

గిద్దలూరు రూరల్: పోలీస్ స్టేషన్‌లో న్యాయం దక్కలేదని మనస్తాపం చెందిన దంపతులు కోర్టు ఆవరణలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సంచలనం సృష్టించిన ఈ ఘటన మంగళవారం గిద్దలూరు కోర్టు ఆవరణలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. గిద్దలూరు మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన పిచ్చిరెడ్డి కుమారుడు వినాయకచవితి రోజు తన స్నేహితులతో కలిసి మద్యం తాగి అదే గ్రామానికి చెందిన ఎస్.శ్రీనివాసరెడ్డి కల్లంలో పడుకున్నాడు. తన కుమారుడిని శ్రీనివాసరెడ్డి చెడువ్యసనాలకు బానిస చేస్తున్నాడన్న అనుమానంతో పిచ్చిరెడ్డి ఘర్షణపడ్డాడు. ఈ క్రమంలోనే గత నెల 29వ తేదీన గణేశ్ నిమజ్జన ఊరేగింపును పిచ్చిరెడ్డి అడ్డుతగిలాడు. దీంతో పిచ్చిరెడ్డికి శ్రీనివాసరెడ్డితోపాటు మరి కొందరికి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువురూ స్థానిక పోలీసు స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. కేసు విషయంలో పోలీసులు తనకు న్యాయం చేయడం లేదని మనస్తాపానికి గురైన పిచ్చిరెడ్డి భార్య నాగమణితో కలిసి కోర్టు ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అప్రమత్తమై భార్యాభర్తలను చికిత్స నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణాలపై ఆకస్మిక దాడులు

- జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో 121 ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న వన్‌టౌన్ సీఐ నాగరాజు

ఒంగోలు టౌన్: జిల్లాలోని ఎరువుల దుకాణాలు, గోడౌన్లలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. జిల్లాలో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యూరియా, ఇతర ఎరువుల కొరత ఏర్పడినట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో మంగళవారం పోలీసులు, వ్యవసాయాధికారులు సమన్వయంగా రంగంలోకి దిగారు. జిల్లాలోని 121 ఎరువుల దుకాణాల మీద దాడులు నిర్వహించారు. ఒంగోలు నగరంలోని బండ్లమిట్ట 2, మంగమూరు రోడ్డు 1, త్రోవగుంట 1, పేర్నమిట్ట, కవరది వ్యవసాయ పరిపతి సంఘంలో ఒక దుకాణాలను తనిఖీలు చేశారు. సీఐలు నాగరాజు, విజయకృష్ణ, వ్యవసాయాధికారులు, పోలీసు సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు. స్టాక్ నమోదు, పీఓఎస్ యంత్రాల్లో నమోదైన వివరాలు, పంపిణీ రిజిస్టర్లు, విక్రయపత్రాలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఎరువుల దుకాణాల్లో వాస్తవ నిల్వలు, పీఓఎస్ యంత్రాల్లో నమోదైన స్టాక్ మధ్య తేడాలున్నాయా అనే కోణంలో రికార్డులను పరిశీలించారు. యూరియాను ఎమ్మార్పీకే విక్రయిస్తున్నారా లేదా అని దుకాణాల వద్ద ఎరువుల కోసం వచ్చిన రైతులను అడిగి తెలుసుకున్నారు. ఒక్కసారిగా పోలీసులు, అధికారులు దాడులు చేయడంతో వ్యాపారులు ఆందోళనకు గురయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ.. ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ఎరువుల విక్రయాలపై రసీదులు తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. ముమ్మందు కూడా తనిఖీలు కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు. ఎరువుల విక్రయాల్లో ఏదైనా అక్రమాలు జరిగినట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు కానీ, వ్యవసాయాధికారులకు కానీ సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు.

కాపర్ వైరు చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు
- మరొకరు పరారీ
- రూ.2.50 లక్షల నగదు స్వాధీనం

కోదాడరూరల్: జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ చేస్తున్న నలుగురు ముఠా సభ్యులను మంగళవారం సూర్యాపేట జిల్లా మునగాల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణానికి చెందిన పాలపర్తి వెంకట్రామయ్య పాత ఇనుము వ్యాపారం చేసేవాడు. అతడికి ఒంగోలు పట్టణానికే చెందిన బలిగా శ్రీకాంత్, గుంటక్ల ఖాజేశ్వరరావు, బోయపాటి అశోక్‌కుమార్, దేవరకొండ ఇషాక్ పరిచయమయ్యారు. వీరంతా చెడు వ్యసనాలకు బానిసలై చోరీలకు పాల్పడుతూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరు ఈ ఏడాది మార్చి, మే నెలల్లో కారు అద్దెకు తీసుకొని సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్‌ఎస్పీ) కాల్వపై లిఫ్ట్ మోటార్లకు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును చోరీ చేశారు. చోరీ చేసిన కాపర్ వైరును ఒంగోలు, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లోని పలు ఫ్యాక్టరీలకు కేజీ రూ.400 చొప్పున విక్రయించారు. అదే మాదిరిగా మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు దొంగతనం చేసేందుకు వచ్చి అనుమానాస్పదంగా కనిపించడంతో పాలపర్తి వెంకట్రామయ్య, గుంటక్ల ఖాజేశ్వరరావు, బోయపాటి అశోక్‌కుమార్, దేవరకొండ ఇషాక్‌ను మంగళవారం మునగాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మరో వ్యక్తి బలిగా శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.2.50లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. నిందితులను పట్టుకున్న మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సీసీఎస్ సీఐ శివకుమార్, ఎస్ఐలు హరికృష్ణ, యాదవేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది రామారావు, కొండలు, మల్లేష్, శివ, ఆనంద్, శ్రీనును సూర్యాపేట ఎస్పీ నరసింహ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

పోలీసుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నేరమా?

- 'సాక్షి' ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమ కేసులు సరికాదు
- కేసులు ఎత్తేయాలని జర్నలిస్టుల డిమాండ్

సాక్షి నెట్‌వర్క్: 'పోలీసు అధికారులకు పదోన్నతులు కల్పించకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడాన్ని పట్టిచూపుతూ వార్త ప్రచురించడం నేరమా? అయినా పోలీసులకు మేలు కలగాలని కాంక్షిస్తూ వార్తలు రాసిన జర్నలిస్టులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం' అని ఏపీయూడబ్ల్యూజేతోపాటు పలు జర్నలిస్టు సంఘాల నాయకులు ప్రశ్నించారు. డీఎస్పీ, అదనపు ఎస్పీల పదోన్నతుల జాబితా పెండింగ్‌లో ఉందని, ప్యానల్ జాబితా ఖరారు చేసి నెలలు గడుస్తున్నా పదోన్నతి కల్పించడం లేదని, ఆ ప్యానల్ గడువు ఆగస్టు 31తో ముగిసిందని, కొత్త ప్యానల్ రూపొందించేలోగా పదోన్నతుల జాబితాలో ఉన్న కొందరు అధికారులు రిటైరైపోతారని ఈ నెల ఒకటో తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురించడాన్ని ప్రభుత్వం జీర్ణించుకోక.. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితోపాటు కొందరు విలేకరులపై కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మార్కాపురం, దర్శి, కనిగిరి డీఎస్పీ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. విజయవాడ ఆటోనగర్‌లోని సాక్షి పత్రిక ప్రధాన కార్యాలయంలోకి సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో పోలీసులు దూసుకెళ్లి జర్నలిస్టుల విధులకు ఆటంకం కల్పించడం సరికాదన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



పోలీసులు 'సాక్షి' దినపత్రిక ఎడిటర్, రిపోర్టర్లపై అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలి. ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న వారిపై ఇలా అక్రమ కేసులు బనాయించటం మంచిది కాదు. పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వం కాపాడాలి.

– ఎన్‌వీ రమణ, ఏపీయూడబ్ల్యూజే ప్రకాశం జిల్లా అధ్యక్షుడు

బ్లాక్ మార్కెట్‌కు రేషన్ బియ్యం!



రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న వాహనం

కంభం: యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున కోమటికుంట వద్ద రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని వేగంగా వెళ్తున్న మినీ ట్రక్ ఢీకొట్టబోయింది. ప్రమాదం బారి నుంచి తృటిలో తప్పించుకున్న సదరు వ్యక్తి వెంటనే జంగంగుంట్ల గ్రామంలో ఉన్న అతని స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో మినీ ట్రక్‌ను అడ్డగించారు. వాహనంలో సుమారు 60 క్వింటాళ్ల రేషయం బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి అవాక్కయ్యారు. డ్రైవరు మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. బియ్యాన్ని యర్రగొండపాలెం నుంచి బేస్తవారిపేట తీసుకెళ్తున్నట్లు స్థానికులు అడిగిన ప్రశ్నకు డ్రైవర్ సమాధానమిచ్చాడు. ఇంతలోనే బియ్యం తరలించే వారు అక్కడికి చేరుకొని వాహనాన్ని తమ వెంట తీసుకెళ్లిపోవడం గమనార్హం. ప్రతినెలా ఒకటో తేదీ రాగానే కార్డుదారులకు రేషన్ బియ్యం చేరుతున్నాయో లేదో తెలియదు కానీ అక్రమ రవాణా మాత్రం దర్జాగా సాగుతోందనేందుకు ఈ సంఘటనే నిదర్శనం. నిత్యం రేషన్ షాపుల నుంచి బియ్యం అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు మామూళ్లు తీసుకుని చోద్యం చూస్తున్నారన్న విమర్శలకు ఈ ఘటన బలం చేకూరుస్తోంది.

కోడి పందేలపై పోలీసుల దాడి

- 44 మోటారు సైకిళ్లు, 7కోళ్లు స్వాధీనం



సంఘటనా స్థలంలో బైకులు, ట్రాక్టర్లు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని నర్సింగోలు గ్రామ శివారులో కోడి పందేల శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఎస్సై బి.మహేంద్ర తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకునేలోగా జూదరులు మొత్తం అక్కడి నుంచి పరారయ్యారు. జూద శిబిరం వద్ద ఉన్న 44 మోటార్ సైకిళ్లు, 7 కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

- గాయపడిన వ్యక్తి చికిత్స కోసం 2 కిలో మీటర్లు వెనక్కి వచ్చిన రైలు



మృతిచెందిన హరిబాబు

మార్కాపురం: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి వ్యక్తిమృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి ప్రకాశం జిల్లా మార్కాపురం–గజ్జలకొండ రైల్వే స్టేషన్‌ల మధ్య జరిగింది. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం బ్రాహ్మణకోడూరుకు చెందిన కమలకంటి హరిబాబు(39) బెంగళూరు వెళ్లేందుకు సోమవారం సాయంత్రం గుంటూరులో కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రాత్రి సమయంలో భోజనం చేసి చేతులు కడుక్కునేందుకు ట్రైన్‌లోని డోరు వద్దకు వచ్చి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఆ సమయంలో రైలు గజ్జలకొండ–మార్కాపురం రోడ్ మధ్య ఉంది. రైలులో ఉన్న ప్రయాణికులు వెంటనే అప్రమత్తమై చైన్ లాగటంతో రైలు ఆగింది. వెంటనే లోకో పైలెట్‌లు, గార్డు అప్రమత్తమై సమాచారం తెలుసుకుని ఉన్నతాధికారులకు తెలిపి క్షతగాత్రుడి కోసం 2 కిలో మీటర్లు వెనక్కి వచ్చి ట్రైన్‌లో ఎక్కించుకుని మార్కాపురం రైల్వే స్టేషన్‌లో చికిత్స కోసం దించారు. అంబులెన్స్‌లో స్థానిక జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కాగా ఆ సమయంలో రైల్వే అధికారులు ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తమై ఆ ట్రాక్‌లో మరో రైలు, గూడ్స్ రాకుండా చర్యలు తీసుకున్నారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతోపాటు కళలూ ముఖ్యం



నవోదయ కళా ఉత్సవ్ పోటీలను ప్రారంభిస్తున్న చక్రపాణి, డాక్టర్ అశోక్ కుమార్ తదితరులు



పోటీలను తిలకిస్తున్న విద్యార్థులు

- నవోదయ విద్యాలయ అసిస్టెంట్ కమిషనర్ బండి చక్రపాణి

ఒంగోలు టౌన్: విద్యార్థులు చదువుతోపాటు కళల్లోనూ రాణించాలని, సహపాఠ్య కార్యకలాపాలైన నృత్యం, గానం, చిత్రలేఖనం, శిల్పకళ, లలిత కళలపై తగినంత శ్రద్ధ చూపాలని నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్ బండి చక్రపాణి సూచించారు. మంగళవారం ఒంగోలులోని జీజీహెచ్ ఆడిటోరియంలో నవోదయ విద్యాలయం రీజినల్‌స్థాయి కళా ఉత్సవ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన చక్రపాణి మాట్లాడుతూ.. ఒంగోలుకు సాహిత్య, సాంస్కృతిక నేపథ్యం ఉందని, సినీ నటి భానుమతి, ప్రజానాట్యమండలి నుంచి వచ్చిన దర్శకులు టి.కృష్ణ, ముత్యాల సుబ్బయ్య, బాబ్జీ, బి.గోపాల్, రామానాయుడు లాంటి దిగ్గజాలకు ప్రకాశం పుట్టినిల్లు అని పేర్కొన్నారు. అందుకే ఒంగోలులో కళా ఉత్సవ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ మాట్లాడుతూ...విద్యార్థుల మెదడు చురుగ్గా పనిచేయడానికి, భావోద్వేగాలను అదుపుల వుంచుకోవడానికి కళలు దోహదం చేస్తాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణ, అండమాన్ నికోబార్, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి 165 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తరలివచ్చారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థిని కుమారి నేహా చేసిన భరత నాట్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో నవోదయ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభాకర రెడ్డి, రీజియన్ పరిధిలోని వివిధ నవోదయ పాఠశాలల ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్, పార్వతి, పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసులు, మ్యూజిక్ టీచర్లు రవి శంకర్, శాంతిశ్రీ, మహాదేవ నాయక్, సనద్ సాహు, ఆర్ట్ టీచర్లు నాగమల్లేశ్వరరావు, జేమ్స్, వీర రాఘవ, ఒంగోలు నవోదయ ప్రిన్సిపాల్ సి.శివరామ్ తదితరులు పాల్గొన్నారు. ఆంగ్ల అధ్యాపకులు చెరుకూరి అయ్యన్న, గుంటూరు నవోదయ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.



గేయాలు ఆలపిస్తున్న విద్యార్థులు